nipuna
Every Wednesday Free Supplement
05.
7 ఆగస్టు 2024
పేజీలు 8

## ఒలెగ్ కోనోనెంకో

అంతరిక్షంలో వెయ్యి రోజులు గడిపిన రష్యాకు చెందిన వ్యోమగామి (కాస్మోనాట్) ఒలెగ్ కోనోనెంకో ప్రపంచ రికార్డు సృష్టించారు. 59 ఏండ్ల అతడు 2008 నుంచి ఐదుసార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) ప్రయాణించారు. జూన్ 4 నాటికి ఆయన వెయ్యి రోజుల పాటు అంతరిక్షంలో గడిపి ఈ రికార్డును సృష్టించారు. మరో రష్యన్ వ్యోమగామి గెన్నడి పడల్కా పేరిట ఉన్న 878 రోజుల రికార్డును ఒలెగ్ అధిగమించాడు.

# కళాత్మక నైపుణ్యం - సృజనాత్మకతకు ప్రతిబింబం

## భారతీయ చారిత్రక సాంస్కృతిక వారసత్వం- నృత్యం

- దేశంలో నృత్యం సామాజిక జీవనంలో భాగంగా రస భావన వ్యక్తీకరణ పద్ధతిగా, ఆధ్యాత్మిక మార్గానికి అన్వేషణగా గుర్తింపు పొందింది. శిల్పాల్లో, పద్యాల్లో వర్ణించిన నటరాజును భారతీయ నృత్యానికి ఆదిగురువుగా పరిగణిస్తారు. ఒక ప్రసిద్ధమైన కథ ఇతివృత్తంగా పాత్రలను, గానాన్ని అందుకు తగిన అభినయంతో హావభావాలతో చేసే కళను నృత్యం అంటారు. ప్రాచీన కాలంలో రాజాస్థానాలు, దేవాలయాలు నృత్యాలకు కేంద్రాలుగా ఉండేవి.
- భారతీయ నృత్యం ప్రధానంగా రెండు రూపాల్లో వ్యక్తమవుతుంది. ఒకటి సంప్రదాయక/ శాస్త్రీయ నృత్యం కాగా రెండోది జానపద నృత్యం. భరతముని రచించిన నాట్య శాస్త్రం నాట్యానికి సంబంధించిన అతి ప్రాచీనమైన గ్రంథం. ఈ గ్రంథంలో భరత నాట్యం, ఒడిస్సీ, కథక్, మణిపురి, కథాకళి అనే ఐదు నాట్య రూపాలను వివరించారు.
- శాస్త్రీయ నృత్యంలో నృత్తం, నృత్యం, నాట్యం వంటి మూడు రూపాలు కనిపిస్తాయి. సంగీతం, పాటలు లేకుండా అభినయించడాన్ని నృత్తం అంటారు. ఒక పాట అర్థాన్ని తెలపడానికి తాళ, లయబద్ధంగా హావభావ యుక్తంగా అంగ విన్యాసాల ద్వారా అభినయించడాన్ని నృత్యం అంటారు. భావాన్ని నాటకీయంగా వ్యక్తీకరించడాన్ని నాట్యం అంటారు.

**ఒడిస్సీ**

- ఒడిశాలో ప్రసిద్ధమైన నృత్యశైలి ఒడిస్సీ నృత్యం. మతపరమైన, భక్తి ప్రధానమైన ఈ నృత్యరీతిలో శైవ, వైష్ణవ సంప్రదాయాలు రెండు కూడా వ్యక్తమవుతాయి. మంగళ చరణ, బాతు/స్థాయీ నృత్యం, పల్లవి, థరిఝ, మోక్ష, త్రిఖండ మజుర వంటి లక్షణాలు ఒడిస్సీ నృత్యంలో ప్రధానంగా కనిపిస్తాయి. 20వ శతాబ్దంలో డా. చార్లెస్ ఫాబ్రీ ఒడిస్సీ నృత్యంపై రాసిన వ్యాసం ఈ నృత్యానికి పునర్జీవం కల్పించిందని పేర్కొనవచ్చు.
- సంయుక్త పాణిగ్రాహి, సోనాల్ మాన్‌సింగ్, కిరణ్ సెహగల్, రాణి కర్ణా, మాధవి ముద్గళ్, ఇంద్రాణి రహమాన్ వంటి నృత్యకారులు ఒడిస్సీ నృత్యానికి విశేష ప్రజాదరణ కల్పించారు.

**పేరిణీ**

- కాకతీయుల కాలంలో విశిష్టమైన నృత్యంగా గుర్తింపు పొందిన పేరిణీ నృత్యాన్ని నటరాజు రామకృష్ణ 'ఆంధ్ర నాట్యం'గా వెలుగులోకి తెచ్చారు. పేరిణీ నృత్యంలో పురుషులతో ప్రదర్శించే వీర రసానుభూతి ప్రధానమైంది. ద్రుపద్ సంప్రదాయ మృదంగ శబ్ద నేపథ్యంలో శివప్రేరణగా పేరిణీ నృత్యం ప్రదర్శిస్తారు. కేరళకు చెందిన మోహినీ అట్టం ఎక్కువగా అభినయాలు, ముఖ కవళికలపై ఆధారపడి ఉంటుంది. భరతనాట్యం, కథాకళిల మిశ్రమ రూపంగా ఉన్న మోహినీ అట్టం స్త్రీలు మాత్రమే ప్రదర్శించే శృంగార రస ప్రధానమైన నృత్యం. వైజయంతిమాల, భారతి శివాజీ, హేమామాలిని, శాంతారావు, వళ్లథోల్ నారాయణ మేనన్ వంటి నృత్య కళాకారులు మోహినీ అట్టం నృత్యానికి ప్రజాదరణ కల్పించారు.




### భరతనాట్యం

- సమకాలీన సంప్రదాయ నృత్యాల్లో భారత నాట్యం అతి ప్రాచీనమైనది. క్రీ.శ. 15వ శతాబ్దంలో తమిళనాడులోని తంజావూరుకు చెందిన వణ్ణయ్య వడివేలు, శివానందం అనే నాట్యాచార్యులు భరతనాట్యం అనే పేరును వెలుగులోకి తెచ్చారు. దేవదాసీలతో ప్రదర్శించే భారతనాట్యం నట్టువ సంప్రదాయానికి చెందింది. భరతనాట్యం అల్లారిప్పుతో మొదలై థిల్లానాతో ముగుస్తుంది. భావం, రాగం, తాళం/ అనుభూతి, మాధుర్యం, క్రమం అనే అంశాలు భరతనాట్యంలో అంతర్భాగంగా ఉంటాయి. రుజురేఖలు, త్రికోణాకృతి ముద్రా భంగిమలు భరతనాట్యంలో ముఖ్య లక్షణాలుగా కనిపిస్తాయి. యామినీ కృష్ణమూర్తి, సోనాల్ మాన్‌సింగ్, బాలసరస్వతి, రుక్మిణీదేవి, మృణాళిని సారాబాయి, పద్మాసుబ్రమణ్యం వంటి వారు భరతనాట్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చారు.

**కథాకళి**

- జానపద నృత్య సంప్రదాయాలైన కుడియాట్టం, కృష్ణాట్టం నేపథ్యంలో మాటలు లేకుండా కేవలం అభినయంతో ప్రదర్శించే కథాకళి కేరళలో ప్రధానమైన నృత్యంగా పేరు పొందింది. పశ్చిమ దేశాల్లో బాలెట్ ఆఫ్ ది ఈస్ట్‌గా గుర్తింపు పొందిన కథాకళి నృత్యాన్ని బహిరంగంగా ప్రదర్శిస్తారు. కఠినమైన, పురుష సహజమైన నాట్యం కలయికగా ప్రదర్శించే కథాకళిలో అలంకరణ, రంగులను ఉపయోగించడంలో నైపుణ్యం, ప్రత్యేకమైన ఆభరణాలను విలక్షణంగా అలంకరించుకోవడం జరుగుతుంది. శాంతారావు, కుంజుకురూప్ నాయర్, కరుణాకరణ్ నాయర్, చథున్ని పణిక్కర్, వళ్లథోల్ నారాయణ్ మేనన్ వంటి కళాకారులు కథాకళి నృత్యానికి విశేష ప్రజాదరణ కల్పించారు.

**కథక్**

- ఒక విషయాన్ని కథగా స్వీకరించి చేసే నృత్యాన్ని కథక్ అంటారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో శివపార్వతులు, రాధాకృష్ణుల చరిత్రలను కథావస్తువులుగా తీసుకొని తిన్నని నడకలు, జోరుపాటు కదలికలు, మారిపోయే ముఖ కవళికలు ఈ నృత్యంలో ప్రధానంగా కనిపిస్తాయి.
- బిర్జు మహరాజ్, శంభు మహరాజ్, ఆచన్ మహరాజ్, లచ్చు మహరాజ్, దమయంతి జోషి వంటి కళాకారులు ఈ నృత్యంలో ప్రసిద్ధి చెందారు.



### మణిపురి

- గౌడీయ వైష్ణవ మతాన్ని ఆధారంగా చేసుకొని కృష్ణ భక్తి తత్వాన్ని, రాధాకృష్ణుల అమరప్రేమ తత్వాన్ని తెలిపే మణిపురి నృత్యాన్ని రంగు రంగుల వస్త్రధారణతో, ఆంగికాభినయంతో ప్రదర్శిస్తారు. మృదువైన, నిదానమైన గుండ్రంగా తిరిగే కదలికలు, వేగంతో కూడిన లయ బద్ధమైన కదలికలు ఈ నృత్యంలో ప్రధానంగా కనిపిస్తాయి. ఝువేరి సిస్టర్స్, గురు బిపిన్ సిన్హా, చారు మాథూర్, నిర్మలా మెహతా వంటి కళాకారులు ఈ నృత్యానికి ప్రజాదరణ కల్పించారు.



**జానపద నృత్యం**

- గ్రామీణ ప్రాంతాల్లో పల్లె ప్రజలు వ్యవసాయం, ఇంటి పనులు, శ్రమతో కూడిన పనులు చేసేటప్పుడు అలసట తెలియకుండా ఉండేందుకు స్త్రీ పురుషులు చేసే నృత్యాలను జానపద నృత్యాలు అంటారు. సంక్రాంతి, దీపావళి, దసరా వంటి పండుగల సందర్భంలో జానపద నృత్యాలు ఎక్కువగా ప్రదర్శిస్తారు. గిరిజన సమాజాల్లో కూడా జానపద నృత్యాలు వివిధ రూపాల్లో ప్రదర్శిస్తారు.
- దేశంలో నృత్యం ఒక సామాజిక జీవన అంశంగా సమాజం మౌలిక స్వభావాన్ని ప్రజల కళాత్మక నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రతిబింబించే సాధనంగా కొనసాగుతుంది.



### కూచిపూడి

- ఆంధ్రప్రదేశ్‌లోని కూచెలపురం అనే గ్రామంలో కూసిలవాళ్లు (కూచిగాళ్లు) అనే బృందం గ్రామ గ్రామాలకు తిరిగి లాస్య, తాండవ, శాస్త్రీయ, జానపదాలకు లయబద్ధంగా చేసే నృత్యాన్ని కూచిపూడి నృత్యం అంటారు. భాగవతంలోని కథలను కూచిపూడి నృత్యంలో ప్రధానంగా ఈ నృత్యాన్ని ప్రదర్శించేవారిని కూచిపూడి భాగవతులు అని కూడా పిలుస్తారు.
- సిద్ధేంద్ర యోగి రూపకల్పన చేసిన ఈ నృత్యంలో విశిష్టమైన ప్రయోగం ఏకపాత్రాభినయమైన భామాకలాపం, గొల్లకలాపం వంటివి ప్రధానంగా ప్రదర్శిస్తారు. కూచిపూడి నృత్యంలో మందుకా శబ్దం, బాలగోపాల తరంగం (పల్లెం అంచుల మీద నృత్యం), తాళ చిత్ర నృత్యం (నర్తకి కాలి వేళ్లతో నాట్యం చేస్తూ బొమ్మలు గీయడం) వంటి ప్రదర్శనలు దేశీయంగా, అంతర్జాతీయంగా అనేక మన్ననలు పొందాయి. కూచిపూడి నృత్యాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడంలో వెంపటి చిన సత్యం, వేదాంతం సత్యనారాయణ, యామినీ కృష్ణమూర్తి, బాలసరస్వతి, శోభానాయుడు, రాజారెడ్డి, రాధారెడ్డి వంటి వారు విశేషంగా కృషి చేశారు.

**భారతీయ చారిత్రక సాంస్కృతిక వారసత్వం- సంగీతం**

- సంగీతం అనేది మానసిక ఆనందాన్ని, ప్రశాంతతను అందించే మధుర కళ. భారతీయ సంగీతం మూలాలు సామవేదంలో ఉన్నాయి. భారతీయ సంగీతం ప్రధానంగా రెండు రకాలుగా కొనసాగుతుంది. ఒకటి శాస్త్రీయ సంగీతం కాగా రెండోది జానపద సంగీతం
- భారతీయ శాస్త్రీయ సంగీతం స్వర మాధుర్యం (మెలోడీ)పై ఆధారపడి ఉంటుంది. రాగం, తాళం ఆధారంగా రూపొందించిన శాస్త్రీయ సంగీతంలో సప్త స్వరాలైన స రి గ మ ప ద ని స లు, వీటి నుంచి ఏర్పడే 22 రాగాలు, ఉప రాగాలు ప్రధానాంశాలు. ఒక నిర్దేశిత క్రమంలో కొన్ని స్వరాలను ఉపయోగించి మిగతా వాటిని ఉపయోగించకుండా గానం చేయడాన్ని రాగం అంటారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో భైరవ రాగం (ప్రశాంతతను సూచించేది), కౌశిక రాగం (సంతోషాన్ని సూచించేది), హిందోళ రాగం (విశ్వ ప్రేమను సూచించేది), మేఘ రాగం (ధైర్యాన్ని సూచించేది), దీపక రాగం (కరుణ రసాన్ని సూచించేది), శ్రీరాగం (స్వచ్ఛమైన సూచించేది) వంటివి ముఖ్యమైన రాగాలు.
- శాస్త్రీయ సంగీతంలో రెండు ప్రధానమైన సంప్రదాయాలున్నాయి. ఒకటి హిందుస్థానీ సంగీతం, రెండోది కర్ణాటక సంగీతం. ఈ రెండు సంప్రదాయాలకు ఆధారం భరతుని నాట్యశాస్త్రం, సారంగదేవుని సంగీతరత్నాకరం.
- ఉత్తర భారతదేశంలో ప్రధాన సంగీత సంప్రదాయంగా గుర్తింపు పొందిన హిందుస్థానీ సంగీతం భారతీయ, పర్షియన్ సంగీత సంప్రదాయాల సమ్మేళనం, హిందుస్థానీ సంగీతంలో జోడ్ (Jod) ను అనుసరించి ఝూలా (Jhala), ఆలాపన (Alap)ను అనుసరించి వాద్య పరికరం ఉంటుంది.
- హిందుస్థానీ సంగీతంలో ధ్రుపద్, డమర్, ఖయల్, ద్రాదా, ఘజల్, టుమ్రీ, టప్ప వంటి సంగీత రచనా రూపాలు ఉంటాయి. సామవేద కాలం నాటి అత్యంత ప్రాచీనమైన భారతీయ సంప్రదాయ మౌఖిక సంగీత శైలి ధ్రుపద్. మధ్యయుగంలో అక్బర్, రామామాన్‌సింగ్, స్వామి హరిదాస్, తాన్‌సేన్, ధ్రుపద్‌లకు విశేష ప్రజాదరణ కల్పించారు. డమర్ శ్రీకృష్ణుడి లీలలను వివరించే సాహిత్యాంశం కాగా ఖయాల్ పర్షియా సంగీత ప్రభావం నుంచి ఆవిర్భవించింది.

మిగతా 6వ పేజీలో...

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

